క్లుప్తంగా

12 మంది జూదరుల అరెస్టు

కారంచేడు/చీరాల: గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న 12 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ 2,08,960ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. సోమవారం సాయంత్రం వాడరేవు-పిడుగురాళ్ల ప్రధాన రహదారిలోని చీరాల-కారంచేడు సరిహద్దులోని రొంపేరు పులక కాలువ కట్ట మీద పేకాడుతన్నట్లు సమాచారం అందిందన్నారు. చీరాల వైపు నుంచి చీరాల 1వ పట్టణ సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలోని పోలీస్ సిబ్బంది, కారంచేడు వైపు నుంచి తమ సిబ్బందితో కలసి ఏకకాలంలో దాడి చేశామన్నారు. మొబైల్ ఫోన్‌లు, ద్విచక్రవాహనాలు సైతం స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్ఐ పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుటే చోరీ


చోరీకి గురైన ఆదాం తాలూకు షాపు

మార్టూరు: పోలీసు స్టేషన్ ముందే ఏ దుకాణంలో చోరీ జరగడం చర్చనీయాంశమైంది. స్థానిక జాతీయ రహదారి పక్కన పోలీస్ స్టేషన్ ఎదురు ఆదివారం అర్ధరాత్రి ఓ బడ్డీ కొట్టులో చోరీ జరిగింది. అందిన వివరాల మేరకు.. మార్టూరు, ఒంగోలు సర్వీస్ రోడ్డులో రాజుగారిపాలెం వెళ్లే మూల మీద స్థానికుడైన మాడుగుల ఆదాం బడ్డీ కొట్టు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం షాపు వద్దకు వచ్చిన ఆదాం షాపు తాళం ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించాడు. షాపు లోపల పరిశీలించగా షాపులోనికి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు షాపు కౌంటర్లో ఉన్న రూ.20 వేల నగదుతో పాటు 8 వేల రూపాయల విలువైన సిగరెట్లు చోరీకి గురైనట్లు ఆదాం గుర్తించాడు. ఆదాం ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దేవతా విగ్రహాలకు వెండి ఆభరణాలు సమర్పణ


దేవతా మూర్తులకు వెండి అభరణాలు అందజేస్తున్న దాతలు

చినగంజాం: మండలంలోని సోపిరాల గ్రామంలో వేంచేసియున్న హరిహర సుత అయ్యప్ప స్వామి దేవాలయంలో దేవతా విగ్రహాలకు దాతలు సోమవారం వెండి ఆభరణాలు బహూకరించారు. గ్రామానికి చెందిన రైల్వే రిటైర్డ్ ఉద్యోగి పర్వతరెడ్డి పద్మనాభయ్య, వెంకట సుబ్బమ్మ దంపతుల కుమారుడు ఎస్ఆర్ఐ పర్వతరెడ్డి, శబరీనాథ్, ప్రవీణ దంపతులు రూ. 4.50 లక్షలతో చేయించిన వెండి ఆభరణాలను ఆలయ కమిటీ చైర్మన్ టీఎస్సార్ ఆంజనేయులుకు అందజేశారు. ఆలయంలోని అయ్యప్ప స్వామి, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి, మాలికపురత్తమ్మ విగ్రహాలకు వెండి కిరీటాలను దాతలు సమకూర్చారు. ఆలయ పూజారి శంకరమిశ్రా ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి దేవతా మూర్తులకు అలంకరింపజేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు గ్రావెల్, సిమెంట్ తూములు అందజేత


గ్రావెల్ పరిచి, సిమెంట్ తూములు వేసిన దాతలు

జే.పంగులూరు: మండల పరిధిలోని నూజిళ్లపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన మద్దినేని కృష్ణ చైతన్య గ్రావెల్, సిమెంట్ తూములను అందజేశారు. వర్షపు నీరు కిందకి వెళ్లటానికి సిమెంట్ తూములు వేసి గ్రావెల్ పరిచినట్లు హెచ్ఎం జీ వెంకటేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో నడకమార్గంలో వర్షం కురిసినప్పుడు వర్షపు నీరు నిలబడి విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలకు ఆటంకంగా మారింది. గమనించి గ్రామానికి చెందిన కృష్ణచైతన్యకు విషయం తెలియండతో గ్రావెల్, సిమెంట్ తూములు ఏర్పాటు చేశాడు. సమస్యను పరిష్కరించినందుకు కృష్ణచైతన్యకు ఉపాధ్యాయులు బీ లావణ్య, కేమా వీరంజనేయులు, వేల్పుల ఏడుకొండలు ధన్యవాదాలు తెలిపారు.

మైనర్‌లు వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరం


మైనర్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ చౌదరి

పర్చూరు(చినగంజాం): మైనర్‌లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని పర్చూరు ఎస్సై జీవీ చౌదరి అన్నారు. పర్చూరులో ద్విచక్రవాహనాలు నడుపుతున్న మైనర్‌లకు ఆయన సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మైనార్టీ తీరకుండానే వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పిల్లల కంటే వారికి వాహనాలు ఇచ్చిన వారు నేరస్తులకు పరిగణిస్తారన్నారు. ఇందులో భాగంగా పర్చూరు వీధుల్లో వాహనం నడుపుతున్న పలువురు మైనర్‌లను ఆయన పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్ఐ పులి గోపి, సిబ్బంది పాల్గొన్నారు. వారాంతపు తనిఖీలో భాగంగా పర్చూరు పోలీసులు పలు వాహనాలను తనిఖీ చేశారు.

కుండానికి.. రాళ్ల గండం !

- బ్రహ్మకుండంలోకి గ్రానైట్ వృథా రాళ్లు
- దేవతామూర్తుల విగ్రహాలు కనుమరుగయ్యే ప్రమాదం
- ఆందోళనలో గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు
- విగ్రహాలను కమ్మేస్తున్న గ్రానైట్ దుమ్ము
- పట్టించుకోని అధికారులు


కొణిదెన బ్రహ్మకుండంలోకి దొర్లిస్తున్న వృథా గ్రానైట్ రాళ్లు

బల్లికురవ: గ్రానైట్ రాళ్ల వలన ఎంతో చరిత్ర ఉన్న ఆలయం కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఘన చరిత్రతోపాటు పవిత్ర స్నానాలు ఆచరించే బ్రహ్మకుండంలోని గ్రానైట్ నిర్వాహకులు వృథా రాళ్లు దొర్లించడంపై భక్తులు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని కొణిదెన గ్రామాన్ని 12వ శతాబ్దంలో రాజులు పరిపాలించినట్లుగా చరిత్రలు చెప్తున్నాయి. గ్రామం నుంచి నక్కబొక్కలపాడు వెళ్లే రహదారిలో కొండకు తూర్పుభాగంలో ఉన్న కుండంలో అప్పట్లో సంవత్సరం పొడవున నీళ్లు ఉండేవి. మునులు ఇక్కడ తపస్సుతో గ్రామంలోని ఆలయాల్లో పూజలు చేసేవారని పురాణగాథ. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ప్రాంతంలో ఆరు సంవత్సరాలుగా కొణిదెన ఆ పంచాయతీలోని గంగపాలెం వాసులు సంయుక్త సహకారంతో అభివృద్ధి పరుస్తున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా..

అభివృద్ధి కమిటీ ఏర్పాటుతో ఆధ్యాత్మిక కేంద్రంగా పలు విగ్రహాలు ఏర్పాటుతో శుభ కార్యక్రమాలు నిర్వహించుకునేలా తీర్చిదిద్దుతున్నారు. కార్తీకమాసం, పరువడి రోజుల్లో ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి బ్రహ్మకుండంలో స్నానాలు చేసేందుకు భక్తులు తరలివస్తుంటారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా బ్రహ్మకుండం కట్టను పటిష్టంతో నీటిని నిల్వ చేస్తున్నారు. లక్ష్మీదేవి సమేత లక్ష్మీ నారాయణుడు, బ్రహ్మదేవుడు, మర్రిచెట్టు అరుగుపై జంట నాగులు, గణపతి, వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరుడిని ప్రతిష్టించారు. బ్రహ్మ కుండంలో శివలింగాన్ని, పార్వతి అమ్మవార్ని, దక్షిణామూర్తి, పంచముఖ ఆంజనేయస్వామి, నవగ్రహాలు, ఓంకార ధ్యాన పరమేశ్వరుడి ప్రతిష్ఠతో నిత్యధూప దీప నైవేద్యాలు చేపడుతున్నారు. గ్రామ సర్పంచ్ కె.లేపాక్షి విష్ణు గ్రామంలో నుంచి బ్రహ్మకుండం వరకు ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయించారు.

వృధారాళ్లు దొర్లిస్తూ ..

కొండపై భాగంలోని గ్రానైట్ క్వారీ నిర్వాహకులు వృథా రాళ్లను పొక్లెయిన్‌తో ప్రతి రోజూ బ్రహ్మకుండంలోకి రెండేళ్లుగా దొర్లిస్తున్నారు. మరో రెండేళ్లు ఇలానే దొర్లిస్తే చరిత్ర కలిగిన కుండం పూడిపోవటంతోపాటు అక్కడే ఉన్న దేవతామూర్తుల విగ్రహాలను గ్రానైట్ దుమ్ము కమ్మివేస్తుందని, దుమ్ము ప్రభావానికి రాబోయో రోజుల్లో విగ్రహాలే కనుమరుగయ్యే ప్రమాదముందని భక్తులు తెలిపారు. చరిత్ర కలిగిన బ్రహ్మకుండంలోకి రాళ్లు దొర్లించిన వారిపై చర్యలు చేపట్టాలని కొణిదెనతోపాటు పరిసర గ్రామాల భక్తులు వేడుకుంటున్నారు.

భయపడుతూ నైవేద్యాలు పెడుతున్నా..



ప్రతి రోజూ బ్రహ్మకుండంలోని దేవతా మూర్తులులకు భయపడుతూ ధూపదీప నైవేద్యాలు పెడుతున్నాను. పైభాగంలోని కొండ నుంచి గ్రానైట్ నిర్వాహకులు నిత్యం పొక్లెయిన్‌తో వృథారాళ్లను కిందకు దొర్లిస్తున్నారు. అవి ఎక్కడ వచ్చి పడతాయో అంతుచిక్కడం లేదు. భయంతో చేసే పూజల్లోనూ ఏకాగ్రత ఉండటం లేదు.

– అద్దంకి నాగబ్రహ్మాచారి, అర్చకుడు


రాళ్లు దొర్లించటంతో వస్తున్న దుమ్ము


బ్రహ్మకుండంలో స్నానాలు చేస్తున్న భక్తులు (ఫైల్)

ముర్రుపాలతో వ్యాధి నిరోధకశక్తి పెంపు


జనకవరంలో తల్లిపాల ప్రాముఖ్యత వివరిస్తున్న అధికారులు


వాడరేవులో సామూహిక సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

చీరాల టౌన్: శిశువుకు ముర్రుపాలను అందించడం నుంచి రెండేళ్ల వరకు ఇవ్వడం వలన బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటుగా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.శేషమ్మ సూచించారు. మండలంలోని వాడరేవు గ్రామ పంచాయతీ స్థాయిలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యాన్ని తెలపడంతో పాటుగా ఐసీడీఎస్ అందిస్తున్న పథకాలను ప్లకార్డుల ద్వారా ప్రజలకు తెలియజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలను రూపొందించారన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తప్పకుండా ముర్రుపాలు పట్టించాలని, ముర్రుపాలలో వ్యాధినిరోధక శక్తిని పెంచే పోషకాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు, గర్బిణీలతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఝాన్సీరాణి, విజయ, లక్ష్మీ, ప్రమీలారాణి, సుజాత,సత్యవతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): తల్లిపాలు బిడ్డకు అందివ్వడం ఎంతో శ్రేష్ఠమైనదని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ తల్లి పాల ద్వారా పిల్లలకు చక్కని పోషణ, వ్యాధి నిరోధక శక్తి, అద్భుతమైన మానసిక శారీరక ఎదుగుదల లభిస్తాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీ బ్రహ్మయ్య, బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ సూపర్ వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

జే.పంగులూరు: మండల పరిధిలోని జనకవరం, భగవాన్‌రాజుపాలెంలో గ్రామాల్లో గల అంగన్వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ, జయప్రద, అంగన్వాడీలు రాణి, పి రజని, ఎస్ రజిని, నాగ శిరోమణి, ఏఎన్ఎం రామాంజమ్మ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రమశిక్షణ కూడా ముఖ్యం


సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తున్న ఎన్‌సీసీ అధికారులు

చినగంజాం: విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యమని చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కే శ్రీనివాసరెడ్డి అన్నారు. పాఠశాల ఆవరణలో సోమవార ఎన్‌సీసీ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికేట్ ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, ఎన్‌సీసీ వంటి వాటిలో రాణించి విద్య, ఉద్యోగ అవకాశాలలో సర్టిఫికేట్‌లను వినియోగించుకోవాలని సూచించారు. ఎన్‌సీసీ పరీక్షకు పాఠశాల నుండీ మొత్తం 48 మంది విద్యార్థులు హాజరు కాగా అందరూ ఏ గ్రేడులో ఉత్తీర్ణత సాధించారని అన్నారు. విద్యార్థులకు హవల్దార్ దీపక్ కుమార్ ద్వారా సర్టిఫికేట్‌లను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి సుబ్బారావు, పాఠశాల పూర్వపు ఎన్‌సీసీ అధికారి ఎస్ నరసింహారావు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకొని రాణించాలి



మాట్లాడుతున్న మాజీ వైస్ చాన్స్‌లర్ మురళీకృష్ణ

వేటపాలెం: ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే విద్యార్థులు ముందుగా లక్ష్యాన్ని ఎంచుకొని చదువుల్లో రాణించాలని మాజీ వైస్ చాన్స్‌లర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్‌కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు పరిచయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కళాశాలకు కేటాయించిన నూటికి నూరుశాతం సీట్లు భర్తీ అవ్వడం అభినందనీయమన్నారు. కళాశాల ఫౌండర్ చైర్మన్ మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు, చైర్మన్ వనమా రాఘవేంద్రరావు, సెక్రటరీ వనమా రామకృష్ణారావు, సెక్రటరీ ఎస్ లక్ష్మణరావు, కమిటీ సభ్యులు అత్తలూరి ఉమామహేశ్వరరావు, పరిటాల సత్యనారాయణ, సి సుబ్బారావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు పర్చూరులో వైద్య శిబిరం

కారంచేడు: పర్చూరు మండలం నాగులపాలెం వైఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు మెడికల్ అసెస్మెంట్ ఉచిత క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, ములబంటి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. కారంచేడు మండలంలోని అన్ని గ్రామాల నుంచి 18 సంవత్సరాల లోపు చిన్నారులు, యువత ఈ అసెస్మెంట్ క్యాంపుకు హాజరుకావచ్చని వారు పేర్కొన్నారు. క్యాంపులో వైద్యులతో పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచింతగా ఉపకరణాలు అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు సహిత విద్యా ఉపాధ్యాయుడు జీ వసంతబాబు 91009 96553 నంబర్‌ను సంప్రదించాలని వారు తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు పరీక్షలు


ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలను పరిశీలిస్తున్న జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎం.జ్యోత్స్న

చీరాల అర్బన్: ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య నిర్ధారణ పరీక్షలను సోమవారం స్థానిక పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించారు. క్యాంపునకు ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన అలింకో డాక్టర్ల బృందం పాల్గొని ఉచిత వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త ఎం.జ్యోత్స్న చీరాల మండల ఎంఈఓలు టి.రమాదేవి, పి.సుధారాణిలు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల నుంచి 18 సంవత్సరాల్లోపు 67 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు హాజరు కాగా వైద్యపరీక్షల అనంతరం 51 మందికి ఉపకరణాలు అవసరమని నిర్ధారించారు. అలానే సదరం సర్టిఫికెట్ ఉండి యూటీఐడీ కార్డులు లేనివారికి యూడీఐడీ కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.కృష్ణమోహన్, మండల సహిత విద్య ఉపాధ్యాయులు డి.రాజశేఖరబాబు, వి.నరసింహ, ఆర్.శ్రీధర్, ధనలక్ష్మి, డి.నాగార్జున, టి.బాలకృష్ణ, యూడీఐడీ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో మోసం చేస్తున్న కూటమి


విద్యుత్ స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

చీరాల రూరల్: అధికారంలో ఉంటే ఒకలా అధికారంలో లేకుంటే మరోలా కూటమి ప్రభుత్వం తీరు ఉందని, ప్రజలపై అధికంగా విద్యుత్ బిల్లులు వేసేందుకు రంగం సిద్ధం చేస్తుందని అందులో భాగంగా ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లు బిగిస్తుందని ప్రజలందరూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని వామపక్షాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గడియార స్తంభం సెంటర్లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేస్తు ప్రజలకు కరపత్రాలు అందించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల సామ్యేలు, నల్లబోతుల మోహన్‌కుమార్‌ధర్మ, మాచర్ల మోహనరావు, నలతోటి బాబురావు, మాజీ సర్పంచులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, చుండూరి వాసు మాట్లాడారు.

కూటమికి నమ్మి ఓటేస్తే ప్రజలు మోసపోయారు


క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

- 29వ వార్డులో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ
- పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు

చీరాల అర్బన్: ఎన్నికల ముందు అమలు కాని హామీలతో ప్రజలను నమ్మించి కూటమి ప్రభుత్వం ఓట్లు దండుకుని ప్రజలను మోసం చేసిందని.. కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక 29వ వార్డులో «బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ» కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్‌బాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల ముందు ఎన్నో పథకాలు ప్రకటించి ఎన్నికల తర్వాత వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలను ఇలా అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సుపరిపాలన పేరుతో ప్రజల వద్దకు వెళ్లి అన్ని అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

అందరిని కలుపుకుని ముందుకు సాగుదాం..

ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందినా ఓటు బ్యాంకు మాత్రం పార్టీకి తగ్గలేదన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికలకు వార్డులలో, స్థానిక సంస్థల ఎన్నికలకు కమిటిలను ఏర్పాటు చేసి సంసిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలలో ఓటమి పాలైన వారు నిరాశ చెందవద్దని నాయకులకు భరోసా కల్పించారు. అందరిని కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఒక్కరికి అండగా తాను అండగా ఉంటానన్నారు. అనంతరం చంద్రబాబు మోసాలను తెలియజేసే క్యూర్ కోడ్ కలిగిన పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కోడూరి ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు బత్తుల అనిల్, లీగల్ సెల్ రాజు వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు కంపా అరుణ్, మాజీ కౌన్సిలర్లు బోయిన రాఘవ, కాగితాల ప్రకాష్, వడ్డెర సంఘ అధ్యక్షులు తన్నీరు రమణయ్య, ఎందేటి దుర్గాప్రసాద్, బట్టు లక్ష్మీనారాయణ, తుమ్మ ఉదయప్రసాద్, జొన్నాదుల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం ఒక్క జగన్‌తోనే సాధ్యం


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి

- నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి

పర్చూరు(చినగంజాం): ప్రజా సంక్షేమం ఒక్క జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యం అవుతుందని పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డి అన్నారు. పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో బాబుష్యూరిటీ–మోసం గ్యారంటీ చంద్రబాబు రీకాలింగ్ మ్యానిఫెస్టో కార్యక్రమాన్ని సోమవారం రాత్రి మండల పార్టీ కన్వీనర్ కఠారి అప్పారావు అధ్యక్షతన మధుసూదనరెడ్డి ముఖ్య అతిథిగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని శివాలయంలో పూజలు చేసి అనంతరం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు కార్యక్రమానికి సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను ప్రజల మొబైల్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేయించి, స్కాన్ చేయించి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించారు. అనంతరం బహిరంగ సభలో ఇన్‌చార్జ్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని అదే విధంగా ఎన్నికలకు ముందు చంద్రబాబు, కూటమి నేతలు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా హామీలను అమలు చేయకపోవడాన్ని వివరించారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను ఒక పవిత్ర గ్రంధంలా బావించి హామీలన్నింటిని అమలు చేశారన్నారు. ప్రస్తుత చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో అమలుపై దృష్టి సాధించలేదన్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ పరిధిలోని రాష్ట్ర,జిల్లా, మండల స్థాయిలో వివిధ హోదాలలో ఉన్న నాయకులు, మండల కన్వీనర్‌లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బల్లికురవ–అద్దంకి రోడ్డులో రాకపోకలు నిషేధం


ఏసీబీ బ్రిడ్జి డైవర్షన్‌లో తీసిన కందకాలు

అద్దంకి రూరల్: బల్లికురవ-అద్దంకి ఆర్అండ్‌బీ రోడ్డులో అద్దంకి బ్రాంచ్ కాలువ దాటే చోట 33/0 వల్లాపల్లి లాకుల వద్ద డైవర్షన్ రోడ్డు నీటి ప్రవాహానికి కోతకు గురైనందున రాకపోకలు నిషేధించినట్లు ఆర్అండ్‌బీ ఏఈ శ్రీమన్నారాయణ సోమవారం తెలిపారు. రెండు రోజుల క్రితం సాగర్ కాల్వకు నీటి విడుదలతో డైవర్షన్ రోడ్డులో రాకపోకలు నిషేధించామని వాహనదారులు బల్లికురవ నుంచి అంబడిపూడి-కొమ్మినేనివారిపాలెం అద్దంకి మేజర్ కాల్వ మీదుగా అద్దంకికి రాకపోకలు సాగించాలన్నారు. ప్రమాదం దృష్ట్యా డైవర్షన్ రోడ్డుకు కందకాలు తీశామని ఎవరు ప్రయాణం సాగించవద్దని ఏఈ వివరించారు. బల్లికురవ నుంచి అద్దంకి డిపో నుంచి బల్లికురవ, సంతమాగులూరు మీదుగా నరసరావుపేట వెళ్లే బస్సును రద్దు చేశారు. బస్సు లేక పోవటంతో 30 గ్రామాల ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు.

టీబీ అంతమే లక్ష్యంగా పనిచేయాలి


అవగాహన కల్పిస్తున్న క్షయ నిర్మూలన సిబ్బంది

చీరాల రూరల్: టీబీ రహిత సమాజాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారాన్ని అందించాలని క్షయనిర్మూలన సిబ్బంది పిలుపునిచ్చారు. క్షయవ్యాధిపై సోమవారం చీరాల టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీబీ మందులు వాడుతున్న బాధితులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రధాన మంత్రి ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా రెండు నెలలుగా క్షయవ్యాధిపై గ్రామస్థాయి నుండి బాపట్ల జిల్లా అధికారి సాధిక్ మహ్మద్, మెడికల్ ఆఫీసర్ జెడి. రమేష్‌బాబుల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సిబ్బంది కార్తీక్, వర్షధార, రియా, నీలిమ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.